ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్

మా కలం - సామాన్యుడి బలం

CELL : 9440352036

# స్వర్ణసాగరం

WWW.SWARNASAGARAM.COM

PRGI : APTEL/26/A1104

జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

9440352036


ఆంధ్రప్రదేశ్ తెలంగాణ

సంపుటి : 1, సంచిక : 165

పేజీలు : 8

బుధవారం 26 ఆగస్టు 2026

వెల : 2-00



## ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఊతం

- 'దేశీయ సంస్థలకే డీఆర్‌డీఓ క్షిపణి టెక్నాలజీ'
- రాజ్‌నాథ్ సింగ్ కీలక నిర్ణయం
- డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల టెక్నాలజీ బదిలీకి రక్షణ మంత్రి ఆమోదం
- దేశీయ తయారీ సామర్థ్యాలను మరింత పెంచడమే లక్ష్యం

2




## కులగణన ప్రశ్నలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి

- మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ
- కులగణనపై ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ
- కులగణనలో తెలంగాణ, బిహార్ పద్ధతిని పరిగణనలోకి తీసుకోవాలని సూచన
- రెండు రాష్ట్రాల్లో కులగణనలో అనుసరించిన విధానం స్పష్టంగా ఉందన్న ఖర్గే, రాహుల్

### ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మేళవింపుతో

# గోదావరి పుష్కరాలు




**10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారని అంచనా.. 181 కొత్త ఘాట్లతో 440 ఘాట్ల అభివృద్ధి**

**రూ.4,026 కోట్లతో 4,932 పనులు.. పనుల్లో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశం**

**భక్తులకు ప్రపంచస్థాయి వసతులు.. రద్దీ నిర్వహణకు కృత్రిమ మేధ వినియోగం**

అమరావతి, స్వర్ణసాగరం

ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మేళవింపుతో గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పుష్కరాల పవిత్రతకు ఎక్కడా భంగం కలగకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని తెలిపారు. పుష్కరాలు ప్రభుత్వం మాత్రమే నిర్వహించే కార్యక్రమం కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని అన్నారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో రూ.4,026 కోట్లతో చేపట్టనున్న 4,932 పనుల పురోగతిని పరిశీలించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరితగతిన ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే పనులకు రూ.899 కోట్లను ఆర్థిక శాఖ కేటాయించినట్లు అధికారులు తెలిపారు. తూర్పుగోదావరిలో 1,869, పశ్చిమగోదావరిలో 625, కోనసీమలో 1,501, ఏలూరులో 426, కాకినాడలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నట్లు వివరించారు. అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి పెట్టడంతో పాటు కేంద్ర సాయాన్ని కూడా పొందాలని సీఎం సూచించారు. 2015 మహా పుష్కరాల్లో రాష్ట్రంలో సుమారు 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు చేయగా.. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు - మిగతా3లో



## డిజిటల్ పేమెంట్ జర్నీలో యూపీఐ టర్నింగ్ పాయింట్

- ప్రతి భారతీయుడు గర్వపడాలి: ప్రధాని మోదీ.. 2016లో ప్రారంభమైన యూపీఐకి పదేళ్లు
- 2025–26లో 24,162 కోట్లకు పైగా లావాదేవీలు
- 11 దేశాలకు విస్తరించిన భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ
- 2026 జులైలో రూ.29.87 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు

2లో



### గ్రేట్ గ్రీన్ వాల్‌లో

# తాటి వనాలు

- 55 లక్షల గింజలు నాటడమే లక్ష్యం
- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యమన్న డిప్యూటీ సీఎం పవన్
- ప్రకృతి విపత్తుల సమయంలో తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పిస్తాయి

అమరావతి, స్వర్ణసాగరం

సుదీర్ఘ తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచం కోసం చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో భాగంగా తాటి వనాలు పెంచే ప్రక్రియ మొదలైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో 55 లక్షల తాటి గింజలను నాటుతున్నట్లు చెప్పారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో లక్షా 65 వేల తాటి గింజలు నాటినట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో తాటి వనాలు తీర ప్రాంత - మిగతా3లో

# గేర్ మార్చాల్సిందే

- స్థానిక ఎన్నికలపై వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు
- ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా గనుక జరిగితే కూటమికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని
- ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కావు
- మన కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు
- అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా నాయకుడు తనతోనే ఉన్నాడనే భరోసా ప్రతి కార్యకర్తకు కలగాలి
- ఇప్పుడు కార్యకర్తకు అండగా నిలబడితేనే, రేపు సాధారణ ఎన్నికల్లో అతడు రెట్టించిన ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తాడు



అమరావతి, స్వర్ణసాగరం

స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా గనుక జరిగితే కూటమికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని ఆయన అన్నారు. మంగళవారం వైఎస్సార్సీపీ ముఖ్యనేతలతో భేటీ అయిన వైఎస్ జగన్.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కావు. మన కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం ఓటేస్తారు. అందుకే చంద్రబాబు ఎన్నికలను నిష్పక్షపాతంగా జరగనివ్వరు. స్థానిక ఎన్నికలను నేతలు ఆషామాషీగా తీసుకోవద్దు. బలమైన అభ్యర్థులను నిలబెడదాం. గతంలో.. ఎంపీటీసీ, మున్సిపాలిటీ, జడ్పీ చైర్మన్, మేయర్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశాం. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా నాయకుడు తనతోనే ఉన్నాడనే భరోసా ప్రతి కార్యకర్తకు కలగాలి. ఇప్పుడు కార్యకర్తకు అండగా నిలబడితేనే, రేపు సాధారణ ఎన్నికల్లో అతడు రెట్టించిన ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తాడు" అని వైఎస్ జగన్ అన్నారు. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన ఒకరకంగా మనకు అనుకూలమే. - మిగతా3లో



## దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉంది

- ఎస్ఐఆర్ నిర్వహించడానికి ధైర్యం, ఓటర్ల సహకారం అవసరం
- ఈసీఐ జ్ఞానేశ్ కుమార్
- ఎస్ఐఆర్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్
- ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించడానికి ఈసీకి ధైర్యం ఉండాలని వెల్లడి
- అందుకు ప్రజల నుంచి సహకారం కూడా అవసరమని అభిప్రాయం
- ఈసీకి ఓటర్ల నుంచి పూర్తి సహకారం లభించింది

2

# వాకాడు 'స్థానిక' సమరంలో

## కూటమి చరిత్ర తిరగరాస్తుందా..? వైసీపీ పాత లెగసీని కొనసాగిస్తుందా..?

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా అధికారికంగా మోగక ముందే వాకాడు మండలంలో రాజకీయ సమరం ఊపందుకుంది. రాష్ట్రస్థాయిలో అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ తమ తమ వ్యూహాలకు పదును పెడుతుండగా.. మండలంలో మాత్రం ఈ పోరు "కొత్త చరిత్ర సృష్టిస్తారా.. పాత చరిత్రనే కొనసాగిస్తారా?" అన్న ఆసక్తికర మలుపు తిరిగింది. గత ఎన్నికల ఫలితాలు, సామాజిక సమీకరణాలు, పార్టీ బలాబలాలు, వలస రాజకీయాలు, అధిష్ఠానాల తాజా ఆదేశాలు అన్నీ కలిసిపోవడంతో ఇకపై వాకాడు రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కనుంది. స్వర్ణసాగరం, వాకాడు




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలను దశలవారీగా నిర్వహించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సంకేతాలు ఇవ్వడంతో పాటు, గత రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే ప్రధాన అజెండాగా ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కులు, సర్ ప్రక్రియపై స్పష్టత వచ్చిన వెంటనే సెప్టెంబర్ చివర్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశంలో పార్టీ ఇన్‌చార్జ్‌లకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలని, ప్రతి స్థానంలో అభ్యర్థులను నిలబెట్టి గెలిపించాలని, ఒక్క ఏకగ్రీవాన్ని కూడా ఉపేక్షించబోమని, స్థానిక ఎన్నికల ఫలితాలనే భవిష్యత్ ఎమ్మెల్యే టికెట్‌కు ప్రమాణంగా పరిగణిస్తామని తేల్చిచెప్పారు. ఈ రెండు రాజకీయ సంకేతాల ప్రభావం వాకాడు మండలంలో ఇప్పటికే కనిపిస్తోంది. అధికార కూటమి నేతలు మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, 11 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో గ్రామాల్లో చురుగ్గా తిరుగుతున్నారు. అధికారంలో ఉండటం, గత రెండు నెలలుగా ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ద్వారా ప్రజల్లో నిరంతరం కనిపించడం, 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఆర్థికంగా బలమైన పలువురు నేతలను తమవైపు తిప్పుకోవడం కూటమికి కలిసి వచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. కొందరు నాయకులైతే ప్రతిపక్షం నామినేషన్లు కూడా వేయలేని పరిస్థితి తీసుకొస్తామని ధీమాగా మాట్లాడుతున్నారనే ప్రచారం మండలంలో వినిపిస్తోంది. అయితే వాకాడు రాజకీయాలను కేవలం ప్రస్తుత బలాబలాలతో అంచనా వేయడం అంత సులభం కాదు. ఈ మండలానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేకమైన చరిత్ర ఉంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, స్థానిక ఎన్నికల సమయానికి మాత్రం వాకాడు తరచూ భిన్నమైన తీర్పు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఆనాటి కాంగ్రెస్ నుంచి నేటి వైసీపీ వరకు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో అధిక విజయాలు సాధించిన రికార్డు ఆ శిబిరానిదే. మండలంలోని అనేక పంచాయతీల్లో రెడ్డి సామాజిక వర్గ ప్రభావం ఎక్కువగా ఉండటం, నేదురుమల్లి కుటుంబానికి ఉన్న రాజకీయ వారసత్వం ఇప్పటికీ వైసీపీకి ప్రధాన బలంగా నిలుస్తోందనే అభిప్రాయం స్థానికంగా ఉంది. అదే సమయంలో ఈసారి వైసీపీ ముందు కొన్ని ఇబ్బందులు కూడా కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికలకు ముందు కొన్ని కీలక పంచాయతీల్లో ఆర్థికంగా బలమైన నేతలు టీడీపీలో చేరడంతో అక్కడ పార్టీ బలం దెబ్బతిన్నట్లు భావిస్తున్నారు. ఆ ఖాళీలను పూర్తిగా భర్తీ చేయడంలో పార్టీ ఇప్పటివరకు ఆశించినంత వేగం చూపలేదనే చర్చ సాగుతోంది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక, గ్రామస్థాయిలో కార్యాచరణ, ప్రజల్లో నిరంతర పర్యటనలు వంటి అంశాల్లో ఇంకా దూకుడు కనిపించలేదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. అయితే జగన్ తాజా ఆదేశాల తర్వాత పార్టీ కేడర్ ఒక్కసారిగా రంగంలోకి దిగితే పోటీ స్వరూపమే మారిపోవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక టీడీపీకి ఈ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు; వాకాడులో దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశంగా కూడా కనిపిస్తున్నాయి. గతంలో చేతికి అందని పంచాయతీలను ఈసారి గెలుచుకుని చరిత్ర తిరగరాయాలనే పట్టుదలతో కూటమి నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. మరోవైపు వైసీపీ మాత్రం **"వాకాడు కంచుకోట ఇప్పటికీ మాదే"** అన్న నమ్మకంతో తన సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది. ఇప్పుడు వాకాడు రాజకీయాల్లో అసలు పోరు రెండు పార్టీల మధ్య కంటే, కొత్త రాజకీయ సమీకరణాలకూ పాత రాజకీయ వారసత్వానికీ మధ్య జరుగుతున్నట్టుగా కనిపిస్తోంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చి ఎన్నికల నగారా మోగిన క్షణం నుంచి ప్రతి పంచాయతీ, ప్రతి ఎంపీటీసీ స్థానం ప్రతిష్ఠాత్మక యుద్ధరంగంగా మారే అవకాశాలు ఉన్నాయి. కూటమి నిజంగానే చరిత్రను తిరగరాస్తుందా? లేక నేదురుమల్లి లెగసీ ఆధారంగా వైసీపీ మరోసారి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటుందా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేది చివరికి వాకాడు మండల ఓటరే.

# కులగణన ప్రశ్నలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి



దేశంలో చేపడుతున్న కులగణన విధానంపై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి ప్రశ్నించారు. కులగణన కోసం ప్రస్తుతం రూపొందించిన ప్రశ్నావళిని పూర్తిగా రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న విధానాన్ని తాము అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. కులగణనలో ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.

### ప్రధానికి మూడోసారి లేఖ

కులగణన అంశంపై ఖర్గే, రాహుల్ గాంధీ ఆగస్టు 20న హిందీలో ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ లేఖ వివరాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మీడియాకు వెల్లడించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం ప్రధానమంత్రికి లేఖ రాయడం ఇది మూడోసారి అని తెలిపారు. అయితే ఇప్పటివరకు ప్రధాని నుంచి ఎలాంటి సమాధానం రాలేదని చెప్పారు. ప్రస్తుత కులగణన ప్రక్రియలో తీసుకుంటున్న చర్యలు కేవలం 'వైట్‌వాష్' మాత్రమేనని జైరాం రమేశ్ విమర్శించారు. కులాల వాస్తవ సంఖ్య, సామాజిక-ఆర్థిక పరిస్థితిని కచ్చితంగా అంచనా వేయాలంటే సరైన విధానంలో కులాల వివరాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఖర్గే, రాహుల్ తమ లేఖలో పేర్కొన్నారు.

### 'ఓపెన్ ఎండెడ్' ప్రశ్నతో సమస్యలు

ప్రస్తుతం కుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఓపెన్ ఎండెడ్ ప్రశ్నావళి విధానాన్ని ఎంచుకుందని కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంటే వ్యక్తి తన కులం పేరును ఏ విధంగా చెబితే అదే పేరును నమోదు చేస్తారని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఒకే కులానికి వేర్వేరు పేర్లు, ఉపకులాల పేర్లు, భాషాపరమైన భేదాలతో కూడిన పేర్లు ఉన్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే కులానికి చెందిన వ్యక్తులు వేర్వేరు పేర్లతో నమోదు అయితే, ఒక కులం అనేక వేర్వేరు కులాలుగా విడిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కులగణనలో వేలాది, లక్షలాది వేర్వేరు కులపేర్లు నమోదయ్యే ప్రమాదం ఉందని, అలా జరిగితే సేకరించిన డేటా ఉపయోగకరంగా ఉండదని పేర్కొన్నారు.

### ఓబీసీ జనాభాపై ప్రభావం

కులాల జనాభా కచ్చితంగా నమోదు కాకపోతే ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితిపై చేసే అంచనాలు కూడా తప్పుగా మారతాయని కాంగ్రెస్ నేతలు అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన వర్గాలు, ఇతర అణగారిన సముదాయాలకు దీనివల్ల నష్టం కలగవచ్చని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయ విధానాలకు సంబంధించిన నిర్ణయాలపై కూడా దీని ప్రభావం పడుతుందని ఖర్గే, రాహుల్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రశ్నావళి విధానంలో దేశంలోని ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అనేది స్పష్టంగా తేలే అవకాశం లేదని వారు పేర్కొన్నారు. కులగణనలో బ్యాక్‌వర్డ్ క్లాస్ అనే పదమే చేర్చలేదని వారు లేఖలో ప్రస్తావించారు. ఈ సమస్యకు సులభమైన పరిష్కారం ఇప్పటికే ఉందని ఖర్గే, రాహుల్ సూచించారు. కులాల పేర్లతో ముందుగానే డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించి, అందులో నుంచి సంబంధిత కులాన్ని ఎంపిక చేసే విధానాన్ని తీసుకురావాలని కోరారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వివరాలను నమోదు చేసే సమయంలో ఇదే తరహా విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు సంబంధించిన ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వంటి ఇప్పటికే అందుబాటులో ఉన్న జాబితాల ఆధారంగా కులాల జాబితాను రూపొందించవచ్చని సూచించారు. తెలంగాణ, బిహార్‌లో నిర్వహించిన కుల సర్వేల విధానాన్ని కేంద్రం పరిశీలించాలని ఖర్గే, రాహుల్ కోరారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ కులాల జాబితాను ఉపయోగించి వివరాలు సేకరించిన విషయాన్ని వారు ప్రస్తావించారు. తమ లేఖకు తెలంగాణ కుల సర్వే-2024, బిహార్ కుల సర్వే-2022లో ఉపయోగించిన కులాల జాబితాల ప్రతులను కూడా జత చేసినట్లు తెలిపారు.

# దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉంది

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించడానికి ఎన్నికల సంఘానికి ధైర్యం, ఓటర్ల నుంచి బలమైన సహకారం రెండూ అవసరమని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈ సహకారం వల్లే కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇతర దేశాల నుంచి గుర్తింపు పొందగలిగిందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌కు ఓటర్ల నుంచి సహకారం పుష్కలంగా లభించిందన్నారు. లఖ్‌నవూలో ఎన్నికల సంఘం నిర్వహించిన 'ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్, ECINET' జరిగిన రెండో ప్రాంతీయ సదస్సులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ఎస్ఐఆర్ నిర్వహణకు ఎన్నికల సంఘానికి ధైర్యం మాత్రమే కాదు. ఓటర్ల సహకారం కూడా అవసరం. ఎస్ఐఆర్ నిర్వహణకు ఈసీకి ఓటర్ల నుంచి ఆ సహకారం పుష్కలంగా లభించింది. అందుకే ప్రస్తుతం ఇతర దేశాలు భారత ఎన్నికల సంఘం వైపు చూస్తున్నాయి. ఈసీఐ నుంచి ఎంతో నేర్చుకుంటున్నాయి, ప్రశంసిస్తున్నాయి. అలాగే తమ దేశాల్లో కూడా ఇలాంటి ఎన్నికల విధానాలను అమలు చేయాలని భావిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలపై అవగాహనను పెంపొందించడానికి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ చాలా అవసరం." భారతదేశంలో ఎన్నికలు రాజ్యాంగం, చట్టం, కేంద్ర ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనల ప్రకారం జరుగుతాయని జ్ఞానేశ్ కుమార్ వివరించారు. అలాగే అన్ని దశల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధుల పర్యవేక్షణలో పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. దేశ ఎన్నికల విధానం, ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు, అలాగే భారత ఎన్నికల సంఘం పాత్ర, పనితీరు గురించి విద్యార్థులు, యువ ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని జ్ఞానేశ్ కుమార్ నొక్కి చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో యువ ఓటర్ల నమ్మకం, అవగాహనతో కూడిన భాగస్వామ్యం ప్రజాస్వామ్య భవిష్యత్తుకు ఒక పెట్టుబడి అని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకతతో కూడుకున్నదని తెలిపారు. లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్ ఓటర్లు చాలా చైతన్యవంతులని కొనియాడారు. అలాగే లఖ్‌నవూ నగరంతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. ఉన్నత విద్య కోసం ఐఐటీకి వెళ్లే ముందు తాను లఖ్‌నవూలోనే చదువుకున్నానని స్పష్టం చేశారు. చాలా కాలం తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ ఓటర్లకు ఒక సందేశాన్ని అందించడానికి తాను లఖ్‌నవూకి తిరిగి వచ్చానని చెప్పారు.

### ఈవీలం గురించి ఏమన్నారంటే?

ఈవీఎంలపై వచ్చిన ఆరోపణలపైనా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పందించారు. ఈవీఎంలను ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని చెప్పారు. వాటికి ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై కనెక్టివిటీ లాంటి సదుపాయాలు ఏవీ ఉండవని వెల్లడించారు. దేశంలో సుమారుగా 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘంతో కోటి 80 లక్షల మంది పనిచేస్తున్నారని వివరించారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు లేదా ఇతరులతో దాన్ని పంచుకునే ముందు కచ్చితంగా దాని మూలాలను, ప్రామాణికతను సరిచూసుకోవాలని కోరారు. "దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్ల కోసం ఎన్నికలు నిర్వహించడం ఒక భారీ టాస్క్‌లా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగాలు రేయింబవళ్లు శ్రమిస్తారు. యువత ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలి. 18 ఏళ్లు నిండిన విద్యార్థులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. ఎన్నికల సంఘం తన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఓటర్ల నమోదు కోసం వీలు కల్పిస్తోంది. యువత ఓటర్లుగా మారడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను కూడా ఎన్నికల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు యువత అత్యంత కీలకమైన చోదక శక్తి. యువత అవగాహనతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది" అని జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

# భారత్‌లో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు

## 98% కేసులకు హెచ్1ఎన్1 వైరస్ రకమే కారణం: ఐసీఎంఆర్



భారతదేశంలో ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న శ్వాసకోశ వ్యాధులకు హెచ్1ఎన్1 వైరస్ రకమే ప్రధాన కారణమని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్? మంగళవారం వెల్లడించారు. తాము పరీక్షించిన ఇన్‌ఫ్లూయెంజా-ఏ కేసుల్లో దాదాపు 98 శాతం ఈ వైరస్ రకానికే చెందినవని ఆయన తెలిపారు. వైరస్‌ల వ్యాప్తిని ఎప్పటికప్పుడు కనిపెట్టేందుకు, భారతదేశం ఒక బహుళ అంచెల, రియల్ టైమ్ వ్యాధి నిఘా నెట్?వర్క్?ను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఈ నిఘా వ్యవస్థ రాష్ట్ర స్థాయి డేటాను 'సమీకృత ఆరోగ్య సమాచార వేదిక' (ఐహెచ్ఐపీ), 'జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం(ఎన్‌సీడీసీ)తో అనుసంధనం చేస్తుందని తెలిపారు. దీనితోపాటు ఐసీఎంఆర్? నేరుగా ఆసుపత్రుల నుంచి సేకరించిన శాంపిల్స్ ద్వారా హెచ్1ఎన్1 వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు పెరుగుదలను తక్షణమే గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటుందని అన్నారు.

"దేశంలో ఏ వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుందో మనకు ఎలా తెలుస్తుంది? కొవిడ్ తర్వాత, భారతదేశంలో ఏ సమయంలో ఏం జరుగుతుందో రియల్? టైమ్?లో గుర్తించే సామర్థ్యాన్ని మనం పెంచుకున్నాం. మేము బహుళ స్థాయిల్లో నిఘా పెడతాం. మొదట ఐహెచ్?ఐపీ, ఎన్?సీడీసీ నిఘా ద్వారా అన్ని రాష్ట్రాల నుంచి ఇన్ఫెక్షన్ల సమాచారం వస్తుంది. దాన్ని మేము తీసుకుంటాం. వారి ల్యాబ్?ల నుంచి వచ్చిన నివేదికలు కూడా మాకు అందుతాయి. ఇవి కాకుండా, ఈ హెచ్?1ఎన్?1 వైరస్? లాంటి పుత్రతి సింద్రోమ్?లను కనిపెట్టడం కోసం, మేము దేశమంతటా 73 ల్యాబ్?లు/ ఆసుపత్రుల ద్వారా ఐసీఎంఆర్? సెంటినెల్? నిఘాను ఏర్పాటు చేశాం. ఇది ఎన్?సీడీసీ కంటే పై స్థాయిలో జరుగుతుంది" అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్? రాజీవ్ బాల్? తెలిపారు.

### విపరీతంగా పెరుగుతున్న కేసులు

ఇతర శ్వాసకోశ వైరస్?లతో పోలిస్తే హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్లు దేశవ్యాప్తంగా విపరీతంగా పెరుగుతున్నాయని రాజీవ్ బాల్ తెలిపారు. అదే సమయంలో కొవిడ్-19 కేసులు స్థిరంగా తగ్గుముఖం పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "ప్రస్తుతం శ్వాసకోశ నిఘా ప్రకారం, హెచ్1ఎన్1 (ఇన్‌ఫ్లూయెంజా-ఏ) ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. మనుషులకు ఇన్‌ఫ్లూయెంజా-ఏ, ఇన్‌ఫ్లూయెంజా- బి అనే రెండు రకాలు వస్తాయి. ఇన్‌ఫ్లూయెంజా-ఏలో మేము ఎక్కువగా చూస్తున్నది హెచ్?1ఎన్?1 వైరస్?. ఇది సుమారు 97-98 శాతంగా ఉంది. కాగా హెచ్?3ఎన్?2 రకం వైరస్ కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే ఉంది. దీనితోపాటు విక్టోరియా లీనియేజ్?కి చెందిన ఇన్?ఫ్లూయెంజా-బి కూడా వ్యాప్తిలో ఉంది. ఇందులో రెండు రకాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒక్కటి మాత్రమే వ్యాప్తిలో ఉంది. అది కూడా అంత ఎక్కువగా లేదు. హెచ్1ఎన్1 మాత్రమే ప్రధానంగా ఎక్కువగా వ్యాప్తిస్తోంది. మూడోది సార్స్-కోవ్-2 (కొవిడ్-19) కేసులు అంతకు ముందు కొద్దిగా ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పుడు అవి తగ్గుముఖం పడుతున్నాయి" అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ చెప్పారు.

### ఈ వైరస్ లక్షణాలు ఇవే!

అయితే హెచ్1ఎన్1తో కూడిన ఈ సీజనల్ ఇన్?ఫ్లూయెంజా సాధారణంగా దానింతట అదే తగ్గిపోతుందని ఐసీఎంఆర్ ప్రకటించింది. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు దీని సాధారణ లక్షణాలు అని పేర్కొంది. సరైన వైద్యం, రక్షణ, విశ్రాంతి ఉంటే చాలా వరకు ఈ వ్యాధి నుంచి కోలుకోవచ్చని స్పష్టం చేసింది. కాగా, దేశ రాజధాని దిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సంఖ్య 2,300 దాటింది. ఈ ఏడాది దిల్లీలో ఇప్పటివరకు దాదాపు మూడు వేల ఇన్‌ఫ్లూయెంజా కేసులు నమోదయ్యాయని.. వాటిలో 2,308 హెచ్1ఎన్1 కేసులు ఉన్నాయని దిల్లీ వైద్యశాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ వెల్లడించారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

# గేర్ మార్చాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

అందుకే బలమైన అభ్యర్థులను నిలబెట్టాలి. ప్రధాన పదవికి బలమైన అభ్యర్థి ఉంటే మిగిలిన ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, వార్డు అభ్యర్థులకు పర్యవేక్షణతోపాటు బలం లభిస్తుంది. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను పోటీకి దింపడానికి వెనకాడవద్దు. ప్రజల గొంతు వినిపించేలా, పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా ప్రతి స్థానంలో పోటీ జరగాలి

**ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయం**

ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు ఆస్కారం ఉండకూడదు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడున్న కో–ఆర్డినేటర్ పార్టీ అభ్యర్థులు కాలేరు. ప్రతి నియోజకవర్గంలో ఎక్కడెక్కడ అభ్యర్థులను నిలబెట్టారో ఎన్నికల అనంతరం నివేదికలు తెప్పించుకుంటా. అభ్యర్థులను నిలబెట్టడమే కాకుండా వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారన్నదానిపైనా నివేదికలు తీసుకుంటా. కార్యకర్తల ఎన్నికల్లో మనం గట్టిగా నిలబడితేనే, మన ఎన్నికల్లో కార్యకర్తలు మన కోసం గట్టిగా నిలబడతారు.

**గ్రామస్థాయి ప్రచార కార్యక్రమం**

"వెన్నుపోటు పార్టీ––వెన్నుపోటు పాలన"పై గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాలు ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య తేడాను వివరించాలి. ఇంటింటి ప్రచారానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని, ప్రచార సామగ్రిని పార్టీ అందిస్తుంది. కార్యక్రమాలన్నీ నిర్దిష్ట తేదీలు, షెడ్యూల్, వ్యవస్థీకృత కార్యాచరణ ప్రకారం జరగాలి.

**14––15 లక్షల గుర్తింపు కార్డులు**

పార్టీ కేడర్ కోసం దాదాపు 14––15 లక్షల గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయి. గ్రామస్థాయి కమిటీలు, అనుబంధ విభాగాల కార్యకర్తల వరకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తాం. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయుల్లో సమావేశాలు నిర్వహించి గుర్తింపు కార్డులు అందించాలి. సమావేశాల్లో గుర్తింపు కార్డులతోపాటు ఇంటింటి ప్రచార సామగ్రినీ కేడర్‌కు పంపిణీ చేయాలి. గుర్తింపు కార్డుల్లో క్యూఆర్ కోడ్ ఉంటుంది; కార్యకర్తలు తమ ఫోన్లలోనే సమాచారాన్ని పొందవచ్చు. సెప్టెంబరు 5,6,7 తేదీల్లో ఒకరోజు ఏదో ఒకరోజు జిల్లాల స్థాయి సమావేశాలు నిర్వహిద్దాం. సెప్టెంబరు 8,9,10,11 తేదీల్లో ఏదో ఒకరోజు అసెంబ్లీ నియోజవకర్గాల స్థాయి సమావేశాలు నిర్వహిద్దాం. ఇక మండల, వార్డు, డివిజన్ స్థాయిల్లో సెప్టెంబరు 12 నుంచి 22 వరకూ సమావేశాలు నిర్వహిద్దాం.

**లీగల్, మీడియా సెల్స్ యాక్టివ్‌గా ఉండాలి**

ప్రతి నియోజకవర్గంలో లీగల్ సెల్, మీడియా సెల్‌లను వెంటనే బలోపేతం చేయాలి. పోటీ జరగకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ కేడర్‌పై దౌర్జన్యాలకు దిగే అవకాశం ఉంది; కార్యకర్తలను రక్షించుకోవాలి. నియోజకవర్గ స్థాయిలో సమర్థులైన న్యాయవాదులను ఒక వేదికపైకి తీసుకొచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉంచాలి. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర లీగల్ సెల్స్ పరస్పరం అనుసంధానమై పనిచేయాలి. అవసరమైన కేసులను హైకోర్టు వరకు తీసుకెళ్లేందుకు సమన్వయ వ్యవస్థ ఉండాలి. పోలీసుల వేధింపులకు గురయ్యే కార్యకర్తలను న్యాయపరంగా రక్షించాల్సిన బాధ్యత పార్టీ తీసుకోవాలి. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి లీగల్, మీడియా వ్యవస్థలన్నీ ఒకే యూనిట్‌గా పనిచేయాలి.

**సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం**

ప్రతి నియోజకవర్గంలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. పార్టీలో సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నవారిని గుర్తించి, మిగిలిన వారినీ యాక్టివేట్ చేయాలి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి వేదికలపైకి మొత్తం పార్టీ కేడర్‌ను తీసుకురావాలి. సోషల్ మీడియా ఖాతాలు ఎలా ప్రారంభించాలి, ఎలా యాక్టివేట్ చేయాలి, ఎలా నిర్వహించాలనే అంశాలపై శిక్షణ ఇవ్వాలి. జగన్ 2.0 సూపర్ యాప్, వైయస్సార్‌సీపీ టాక్స్, పార్టీ సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజల్లోకి సందేశం తీసుకెళ్లాలి. పార్టీకి సంబంధించిన యూట్యూబ్ ఛానళ్లు, సోషల్ మీడియా వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకోవాలి. పార్టీ కేడర్‌కు వాస్తవ సమాచారం, అవసరమైన న్యూస్ కంటెంట్ నిరంతరం అందాలి. నియోజకవర్గాల్లోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను వ్యక్తిగతంగా కలిసి పార్టీకి మద్దతుగా నిలవాలని కోరాలి. ఎందుకంటే.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వంటి ప్రతికూల మీడియా వ్యవస్థలతో మనం యుద్ధం చేస్తున్నాం. నియోజకవర్గాల్లో మీడియా, సోషల్ మీడియా, లీగల్ సెల్స్‌పై యాక్టివ్‌గా లేని నాయకులు ఇప్పటికైనా గేర్ మార్చాలి. నాయకులు కార్యకలాపాలను తమ నియంత్రణలోకి తీసుకోకపోతే కార్యకర్తలు నష్టపోతారు. ఇంటింటి ప్రచారం ద్వారా ప్రతి కుటుంబానికి వైయస్సార్‌సీపీ––కూటమి పాలన మధ్య తేడాను వివరించాలి.

**ఈగోలకు తావులేదు**

స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంటుంది కాబట్టి అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకం. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలను పక్కనపెట్టి అందరినీ కలుపుకొని వెళ్లాలి. తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలూ ఉన్నాయి. కాబట్టి ప్రతి ఓటూ కీలకమే. "జో జీతా వహీ సికందర్".. గెలుపే ముఖ్యం, గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి. ప్రతి గ్రామంలో పార్టీని బలంగా కన్సాలిడేట్ చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం సృష్టించాలి. రాబోయే 60––70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా పూర్తిగా స్థానిక ఎన్నికలపైనే దృష్టిపెట్టాలి. సరైన శ్రద్ధ, పూర్తి స్థాయి కార్యాచరణ ఉంటే స్థానిక ఎన్నికల్లో గెలుపు జెండా ఎగరేస్తాం

**వాళ్ల పేర్లు డిజిటల్ బుక్‌లోకి..**

పోలీసు అధికారులు పదవిని దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, ధర్మంగా వ్యవహరించాలి. కానీ అలా జరగడం లేదు. కార్యకర్తలను వేధించే, అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలి. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవు. ప్రతి పోలీసు అధికారి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరుతున్నాం. పోలీసు వ్యవస్థలో నిష్పాక్షికత తీసుకురావడానికి పార్టీ నాయకులు గట్టి ప్రయత్నం చేయాలి అని వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు.

# కూటమిలో ఎవరి బలం ఎంత

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో కూటమిలో ఏ పార్టీ బలంగా ఉన్నాయంటే అన్నీ వేళ్లూ టీడీపీ వైపు చూపుతాయి. టీడీపీకి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. క్షేత్ర స్థాయిలో బలం ఉంది. తెలుగుదేశం పార్టీకి ఒకే ఒక మైనస్ సొంతంగా పోటీ చేసి ఎప్పుడూ గెలవకపోవడమే. అదే పొత్తులతో ఇప్పటి వరకూ చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కానీ సీట్ల పంపకాల విషయంలో మాత్రం ఖచ్చితంగా టీడీపీదే పై చేయిగా ఉంటుంది. ఎందుకంటే బలం, బలగం అధికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ రాజీ పడే అవకాశముండదు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించే అవకాశం లేదు. ఎన్నాళ్ల నుంచో కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న ధోరణిలో ఉన్నారు. అందులోనూ టీడీపీకి అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వం ఉంది. ఓడిపోయినా.. గెలిచి సత్తా చూపించిన చరిత్ర ఆ పార్టీది. అలాగే ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ టీడీపీ రాష్ట్రంలో ఏ స్థానాల్లోనైనా రాజీ పడలేదు. ఎమ్మెల్సీ స్థానాలను కూడా తమ సంఖ్యకు అనుగుణంగా సాధించుకుంది. గత ఎన్నికల్లో 130కి పైగా స్థానాలను సాధించిన ఆ పార్టీకి ఎక్కువ స్థానాలను ఆశించడంలో తప్పులేదు. అలాగే కూటమిలోని విపక్షాలు అత్యాశకు పోవడం కూడా మంచిది కాదు. ఎందుకంటే.. స్థానిక సంస్థల ఎన్నికలు క్యాడర్ తో పాటు పార్టీని బలోపేతం చేసేవి కావడంతో ఖచ్చితంగా ఈ ఎన్నికలను సైకిల్ పార్టీ సవాల్ గా తీసుకుంటుంది. గత వైసీపీ పాలనలో పోటీ చేసి ఒక్క స్థానంలో గెలవలేదన్న కసి టీడీపీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ కనిపిస్తుంది. ఆ అవకాశాన్ని ఇప్పుడు వదులుకోలేరు. చంద్రబాబు కూడా అందుకు అంగీకరించే అవకాశాలుండవు.బలమైన పార్టీ కావడంతో... ఏ పక్షమైనా తమ బలాన్ని బట్టి ముందుకు వెళితే ప్రత్యర్థి పార్టీని కట్టడి చేయవచ్చు. 175 నియోజకవర్గాల్లో బలంగా ఉన్న టీడీపీకి,



మిగిలిన రెండు పార్టీలకు చాలా వ్యత్యాసం ఉంది. అవి కేవలం కొన్ని నియోజకవర్గాలు, కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. అందుకే ఇచ్చింది తీసుకోవడం మినహా మరో దారి కూటమిలోని మిగిలిన పార్టీలకు ఉండదు. అలాగని కూటమి నుంచి విడిపోతే రాజకీయ నష్టం కేవలం టీడీపీకే మాత్రం జరగదు. మిగిలిన జనసేన, బీజేపీలకు కూడా జరుగుతుంది. ఆ సంగతి చంద్రబాబుకు కూడా తెలియంది కాదు. అందులోనూ సరైన నాయకత్వం లేనప్పుడు మేయర్, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగితే టీడీపీకి తప్ప మిగిలిన రెండు పార్టీలకు సరైన నాయకత్వం లేదు. నిలబడి.. పోటీ చేసే నాయకుడు ఎవరు? అన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రాదు. అదే టీడీపీకి బలమైన నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఉన్నారు. అదే తేడా. అందుకే కుదరదు అంటూ బాబు కూటమిలోని మిగిలిన పార్టీల ప్రతిపాదనలను కొట్టిపారేసే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి.

# ఇక పచ్చటి ప్రకాశం

**ఒంగోలు :** ఫ్లోరైడ్ రక్కసి కోరల్లో చిక్కుకుని, తీవ్ర కరవుతో అల్లాడిపోయిన పశ్చిమ ప్రకాశం నేలలకు జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కల ఎట్టకేలకు సాకారమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మళ్లీ తన చేతుల మీదుగానే తొలి దశను జాతికి అంకితం చేసే స్థాయికి తీసుకురావడం ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. ప్రకాశంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, సుమారు 23 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పం నేడు సంపూర్ణ వాస్తవ రూపం దాల్చింది.వెలిగొండ ప్రాజెక్టు ప్రస్థానాన్ని నిశితంగా గమనిస్తే.. చంద్రబాబు అధికారంలో ఉన్న కాలంలోనే ఈ ప్రాజెక్టు పనులు పరుగులు తీశాయి. నల్లమల అడవుల గుండా అత్యంత సంక్లిష్టమైన రెండు భారీ సొరంగాలను తవ్వి కృష్ణా జలాలను తరలించే ఈ ఇంజనీరింగ్ అద్భుతాన్ని గత పాలకులు ఖర్చు దండగ అనుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల ముందు అరకొర పనులతో ప్రారంభోత్సవాల డ్రామాలు ఆడినప్పటికీ, క్షేత్రస్థాయిలో నీటిని నింపే పనులు మాత్రం ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టువదలని విక్రమార్కుడిలా చంద్రబాబు నిధుల కొరతను అధిగమించి, గత రెండేళ్ల కాలంలోనే రూ.2,250 కోట్లకు పైగా వెచ్చించి మొదటి దశ పనులను శరవేగంగా కొలిక్కి తెచ్చారు.చరిత్రలో ఏ భారీ నీటిపారుదల ప్రాజెక్టులోనూ లేని విధంగా, జలాశయంలోకి నీటిని విడుదల చేయడానికి ముందే ముంపు బాధితులకు పునరావాసం, పరిహారం పూర్తి చేయడం చంద్రబాబు ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనం. గతంలో ప్రాజెక్టులు పూర్తయినా నిర్వాసితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేది. కానీ వెలిగొండ విషయంలో ఆ పరిస్థితి రానివ్వకుండా, ప్రాజెక్టును ప్రారంభించే సమయానికే మూడో విడత కింద రూ.250 కోట్ల పరిహారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 ముంపు కుటుంబాలకు రూ.768 కోట్లకు పైగా చెల్లించి, దాదాపు 85 శాతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని పారదర్శకంగా పూర్తి చేసి బాధితుల కన్నీళ్లు తుడిచారు.నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవడంతో పాటు, అటు దశాబ్దాలుగా చుక్క నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయడంతో ఇటు నిర్వాసితులు, అటు అన్నదాతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లమల సాగర్ జలాశయం ద్వారా కరవు నేలలు సస్యశ్యామలం కాబోతుండటం ప్రాంతీయ అభివృద్ధికి నూతన ఊపునిస్తోంది. చిత్తశుద్ధి, సంకల్ప బలం ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా దశాబ్దాల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయవచ్చని నిరూపిస్తూ.. చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

## ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మేళవింపుతో గోదావరి పుష్కరాల



-మొదటిపేజీ తరువాయి

వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రోజుకు కోటి మంది వరకు పుణ్యస్నానాలు చేసే అవకాశం ఉన్నందున రద్దీని తట్టుకునేలా 440 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. తూర్పుగోదావరిలో 82, పశ్చిమగోదావరిలో 40, కోనసీమలో 175, ఏలూరులో 44, కాకినాడలో 88, పోలవరంలో 11 ఘాట్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని పిఠాపురం శక్తిపీఠం, నాలుగు పంచారామ క్షేత్రాలు, ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. భక్తుల కోసం హోమ్‌స్టేలను ప్రోత్సహించాలని, కొత్త హోటళ్ల నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రాజమహేంద్రవరంలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని, దేశ, విదేశాల్లోని ప్రముఖులను గోదావరి పుష్కరాలకు ఆహ్వానించాలని తెలిపారు. కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించేలా దేవదాయ, పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పుష్కర ఘాట్లను కలిపే రహదారులతో పాటు పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో ఏ రోడ్డుపైనా గుంతలు కనిపించకూడదని, పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారులను అభివృద్ధి చేయాలని సూచించారు. వంతెనల సామర్థ్యాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, గోదావరిలోకి మురుగునీరు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీప దీవుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. రద్దీ, భద్రత నిర్వహణలో కృత్రిమ మేధ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు వంటి సాంకేతికతలను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. వైద్య సేవల కోసం అంబులెన్స్‌లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలతో పాటు 30 తాత్కాలిక ఫీల్డ్ ఆసుపత్రులు, అనుబంధ ప్రయోగశాలలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని 260 గ్రామ పంచాయతీల్లో 50 పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని మునికూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించేందుకు 487 హరిత ఇంధన బస్సులను వినియోగించడంతో పాటు 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రత కోసం 2,697 రక్షణ పడవలు, 8,955 మంది శిక్షణ పొందిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు కలిసే ఉపనదులు, వాగులు, ఏరులను పరిగణనలోకి తీసుకుని 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం, భద్రత, వసతి వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, వై.సత్యకుమార్‌యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రేట్ గ్రీన్ వాల్‌లో తాటి వనాలు

-మొదటిపేజీ తరువాయి



గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు పని చేస్తాయని అన్నారు. తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉంచడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుందని వివరించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పవన్ తెలిపారు.

**ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం**

ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాన్ని రక్షించడం, వాటి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర అటవీ శాఖ "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మహా హరిత కుడ్యం)" ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం తీరప్రాంతం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పుతో పర్యావరణ కారిడార్ ఏర్పాటు చేయనుంది. దీన్ని తీరానికి బయోషీల్డ్‌గా (జీవ రక్షణ కవచం) తీర్చిదిద్దనుంది. మొత్తం 3 జోన్లతో గ్రేట్ గ్రీన్ వాల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే కార్యాచరణ మొదలైంది.

తీరప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు తరచూ తుపానులు, సునామీలు, వరదలు, సముద్రమట్టం పెరుగుదల, తీరప్రాంత కోత ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు.

కృష్ణా–గోదావరి డెల్టాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకుపోకుండా కాపాడే సహజ రక్షణ కవచాలైన నదీ ముఖద్వారాల పరిసర ప్రాంతాల్లో సముద్రపు కోత తీవ్రంగా ఉంది. దీని వల్ల భూమిని కోల్పోతున్నాం. పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. వరదలు పెరుగుతున్నాయి.

తుపానులు, వరదల వల్ల పంటలు, పశుసంపదతో పాటు మత్స్యకార మౌలిక వసతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కలుషిత నీరు, క్షీణిస్తున్న వ్యవసాయ భూములు ఆహార సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి.

ఈ తరహా సహజ విపత్తుల నుంచి రక్షించేందుకు 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గ్రేట్ గ్రీన్ వాల్‌ను పూర్తి చేసి దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలుపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారు.

**3 జోన్లతో ఏర్పాటు:**

జోన్–1: సముద్ర దిశ వైపునున్న అంచు (సీవార్డ్ ఎడ్జ్): నదీ ముఖద్వారాల వద్ద మడ అడవులు పెంచుతారు. నదీ ముఖం కాని ప్రాంతాల్లో షెల్టర్ బెల్ట్‌లు (చెట్ల వరసలు లేదా పొదల సమూహం) ఏర్పాటు చేస్తారు.

జోన్–2: గాలి నిరోధకాలు (విండ్ బ్రేక్స్): కాలువగట్లపై భారీ ఎత్తున మొక్కలు నాటతారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచుతారు

జోన్–3: కమ్యూనిటీ బఫర్: ఆగ్రో ఫారెస్ట్రీ కింద సాగు చేయిస్తారు. ప్రజా భాగస్వామ్యంతో వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/26/2026 4:15 AM Page 1



# కాంప్లెక్స్‌లో స్థానిక వృత్తిదారులకు న్యాయం చేయకపోతే ఉద్యమం తప్పదు -- బీజేపీ





## బాధితులతో కలిసి ఆర్అండ్‌బీ డీఈఈ రమేష్‌కు వినతిపత్రం

## పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 25

హుజూర్ నగర్ పట్టణంలోని రోడ్లు,భవనాల (ఆర్అండ్‌బీ)శాఖ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానిక కులవృత్తులు, చేతివృత్తిదారులకు తొలి ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బాధితులతో కలిసి ఆర్అండ్‌బీ డీఈఈ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ... సదరు ప్రాంతంలో 30 నుంచి 40 ఏళ్లుగా చిన్న చిన్న కులవృత్తులు, చేతిపనులు చేసుకుంటూ జీవిస్తున్న అనేక కుటుంబాలు ప్రస్తుతం ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్మిస్తున్న నూతన కాంప్లెక్స్‌లో షాపుల కేటాయింపులో వీరికి మొదటి ప్రాధాన్యం ఇస్తే కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి లభిస్తుందన్నారు. అధికారులు స్పందించి స్థానిక బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితుల తరపున బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, మేళ్లచెరువు లక్ష్మణ్, చుక్క హరీష్, సతి బల్వంత్ సింగ్,బాధితులు మంగమ్మ ,నాగమణి, మేరీ,ఈశ్వరమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతి శిక్షణ

## లింగ భావన, డిజిటల్ ప్లాట్ ఫామ్ పై అవగాహన





## ఐరాల సిడిపిఓ నిర్మల

స్వర్ణ సాగరం పూతలపట్టు ఆగస్టు 25

పూతలపట్టు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చివరి రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగ భావన, అంగన్వాడీలో డిజిటల్ ప్లాట్ఫారం వినియోగం, పిల్లల అభివృద్ధి అభ్యసన అంచనా వంటి విషయాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. బాల్యదశ మరియు విద్యలో లింగ సమానత్వం యొక్క ప్రాముఖ్యత, తరగతి గదిలో మరియు కృత్యాలలో లింగ సంబంధిత అంశాలు, లింగ వివక్షత లేకుండా బోధించడం, 3-6 సంవత్సరముల పిల్లలలో సాధారణ పద్ధతిలో ప్రవర్తన ఎలా ఉంటుంది, అంగన్వాడి కేంద్రాల్లో డిజిటల్ యొక్క ప్రాముఖ్యత గురించి అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు.ఈ శిక్షణలో చెప్పినటువంటి అంశాలను ప్రాథమిక స్థాయిలో ఆచరణలో అమలు చేయాలని ఐరాల ప్రాజెక్ట్ అధికారిని నిర్మలా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు వాసుదేవన్, ఈశ్వర ప్రసాద్, సూపర్వైజర్లు భారతి, రమాదేవి మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు దొడ్డిపల్లిలో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎంపీ,ఎమ్మెల్యే





చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 25

చిత్తూరు దొడ్డిపల్లిలోని కల్యాణ మండపాన్ని ఆధునీకరించిన చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపాన్ని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ , చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ గారు,చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత గారితో కలిసి ప్రారంభించారు.శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి కళ్యాణ మండపంలోని విభాగాలను ప్రారంభించారు. చిత్తూరు పరిసర ప్రాంతాల ప్రజలకు షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపం మరిన్ని సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మారిన కాలం.. ఆరుతడి పంటలతోనే లాభాల పంట

- తగ్గుతున్న భూగర్భ జలాలు.. వ్యవసాయ అధికారుల సలహాలు తప్పనిసరి
- ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి
- ప్రతి పొలానికి వాలంటీర్లు.. డిజిటల్ పంటల నమోదు
- నెలాఖరులో కేంద్ర ప్రభుత్వ ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ప్రారంభం
- మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్



స్వర్ణసాగరం డోర్నకల్ ఆగష్టు 25:

రోజురోజుకూ వర్షపాతం తగ్గిపోతుండటంతోభూగర్భ జలాలు క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని ఆత్మ మరిపెడ డివిజన్ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.గొల్లచెర్ల రైతు వేదికలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్పీఎల్ ఆధారిత రైతు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో డిజిటల్ పంటల నమోదు కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు.వాలంటీర్లు నేరుగా ప్రతి పంట వద్దకు వచ్చి ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని ఈ ప్రక్రియకు రైతులందరూ సహకరించాలని కోరారు.అలాగే నెలాఖరులోగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ అందుబాటులోకి రానుందని దీనిపై అన్నదాతలకు అవగాహన కల్పించారు.ఏడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓ శ్రీదేవి,కస్నా తండా సర్పంచ్ శంకర్ నాయక్,ఆత్మ కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, అనంతరెడ్డి,వెటర్నరీ డాక్టర్ నాగేశ్వరరావు,ఏఈఓలు అవినాష్,పవన్,అనూష,అభ్యుదయ రైతులు తదితరులున్నారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# బిందేశ్వరి ప్రసాద్ మండల్ అసమాన త్యాగశీలి

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు



స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 25

బీసీ రిజర్వేషన్లు, బీసీల భవిష్యత్తు కోసం బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) ముఖ్యమంత్రి పదవిని సైతం త్యాగం చేసిన అసమాన సాహసి అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్‌లోని శాంతి స్థూపం వద్ద నిర్వహించిన బీపీ మండల్ 107వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూడకుండా, ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, రూ.2 లక్షల కోట్ల నిధులతో బీసీ సబ్ ప్లాన్ అమల్లోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, చెక్కుల రమేష్, చిలకరాజు శీను తదితరులు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం మండలంలో వర్షం కోసం నడివీధి సత్యమ్మకు 108 బిందెలతో జలాభిషేకం

బంగారుపాళ్యం.స్వర్ణ సాగరం.ఆగస్టు 25



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని నడివీధి సత్యమ్మ దగ్గర బంగారుపాళ్యం మండలంలో వర్షాలు బాగా కురవాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం బి కుమార్ రాజా,మాజీ సర్పంచ్ ఏం బి కృష్ణమూర్తి,మాజీ ఉపసర్పంచ్ కామరాజు ల ఆధ్వర్యంలో సత్యమ్మకు 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించి సత్యమ్మ అమ్మవారిని మండలంలో పుష్కలంగా వర్షాలు కురవాలని కోరుకున్నారు వర్షాలు లేకుండా బంగారుపాళ్యం మండలంలో రైతులు పంటలు పండించలేక ఇబ్బందులు పడుతున్నారని సకాలంలో వర్షాలు కురుసి రైతులు సంతోషంగా ఉండాలని సత్యమ్మను కోరుకున్నారు

# మట్టి గణపతి విగ్రహాలనే పూజించండి.



చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 25

వినాయక చవితి పర్వదినాలను పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలో మట్టితో చేసిన గణపతి విగ్రహాలనే పూజకు వినియోగించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు గారితో కలిసి చిత్తూరు దొడ్డిపల్లిలో వినాయకుడి మట్టి విగ్రహాల తయారీ కేంద్రంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. రానున్న వినాయక చవితికి పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలనే వినియోగించాలని, స్వచ్ఛ చిత్తూరు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, స్థానిక కూటమి నాయకులు నళిని తిరకుమరన్, గోపాలకృష్ణ, క్లస్టర్, డివిజన్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

## చిత్తూరు లో ఈ నెల 26, 27 తేదీల్లో ఉద్యోగ మేళా

చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు,25



జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో చిత్తూరు లోని ఎస్వీ సెట్ లో నిర్వ హించే ఉద్యోగమేళాను యువత సద్విని యోగం చేసుకోవాలని ట్రైనింగ్ కలెక్టర్ వెంకటేష్ కోరారు. మంగళవారం తిరుపతి రోడ్డులో ఉన్న వాం కళాశాలను ఉద్యోగ మేళా సంబంధించిన ఏర్పాట్లను ట్రైనింగ్ కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడికొచ్చి నిరుద్యోగ యువతకు సురక్షితమైన తాగునీరు, మెడికల్ క్యాంపు, హెల్ప్ డెస్క్, ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి పొరబాట్లు జరగకుండా కళాశాల యాజమాన్యం సహకారం తీసుకొని ఉద్యోగ మేళా సంబంధించినకార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణ భూషణ్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ అధికారి. పద్మజ, కళాశాల ప్రిన్సిపల్ మోహన్ బాబు పాల్గొన్నారు

swarna sagaram_Swarna sagaram.qxd 8/26/2026 4:15 AM Page 2



# నెల్లటూర్‌లో ఎస్ఐఆర్ నోటీసుల వెరిఫికేషన్



వరదయ్య పాలెం స్వర్ణ సాగరం ఆగస్టు 25

వరదయ్యపాలెం మండలంలోని నెల్లటూర్ గ్రామ పంచాయతీలో ఎస్ఐఆర్ (ూ×=) ప్రక్రియలో భాగంగా నోటీసుల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత ఓటర్లకు జారీ చేసిన నోటీసులను పరిశీలించి, వారి వివరాలను అధికారులు ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడీఓ (ూ+ూఔ) బసిరెడ్డి పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా ధృవీకరించుకోవాలని అధికారులు సూచించారు.ఎస్ఐఆర్ నోటీసుల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ విశ్వనాథ స్వామివారికి రుద్రాభిషేకం..



- భారీ అన్నదానం

మనుబోలు, స్వర్ణ సాగరం :

మనుబోలు మండల కేంద్రంలో వెలసి ఉన్న ప్రసిద్ధ శ్రీ విశ్వనాథ స్వామి వారి దేవస్థానంలో సోమవారం పవిత్ర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా విశేష పూజలు జరిగాయి. మూలవిరాట్‌కు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదారతో కూడిన పంచామృతాలతో పాటు వివిధ సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా భక్తుల సౌకర్యార్థం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు స్థానిక భక్తులు ముంగర విజయభాస్కర్ రెడ్డి, విజయమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి పూజాద్రవ్యాలు సమకూర్చడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమంలో స్థానిక ప్రజలు, శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# వైయస్ జగన్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన కనిగిరి వైయస్సార్‌సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 25



తాడేపల్లి వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేత,మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని కనిగిరి నియోజకవర్గం వైయస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గారు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబందించిన పలు కీలక అంశాలు జగన్ గారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం హామీల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రణాళికలు,ప్రతి ఇంటా ప్రచార కార్యక్రమం ,వైయస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రచారం,తాజా రాజకీయ పరిణామాలు,ఎస్ఐఆర్ ప్రక్రియ తదితర కీలక అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు దద్దాల వెల్లడించారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్తకు, పార్టీ నాయకులకు అండగా నిలబడాలని, కూటమి కుతంత్రాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, నీకు అన్ని విధాలుగా పార్టీ, వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు అండగా నిలబడతానని భరోసా ఇచ్చినట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

# కనిగిరి నియోజకవర్గం ముస్లిం సోదర, సోదరీమణులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు - డాక్టర్ దద్దాల

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 25



మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గారు శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలైన దాతృత్వం, కరుణ, ధార్మిక చింతన, సర్వమానవ సమానత్వం, ఐకమత్యం మానవాళికి సదా అనుసరణీయమని పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధలతో ఈ పండుగ జరుపుకోవాలని దద్దాల నారాయణ యాదవ్ ఆకాంక్షించారు.

# ఘరానా ఎటిఎం మోసగాడిని అరెస్ట్ చేసిన బంగారుపాలెం పోలీసులు.

## రెండు ఎటిఎం మోసం కేసుల ఛేదన.

## రూ.30,900 నగదు, 67 ఎటిఎం కార్డులు, మోటార్ సైకిల్ స్వాధీనం.





బంగారుపాలెం.స్వర్ణసాగరం.ఆగస్టు 25

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలంలో ఎటిఎం కేంద్రాల వద్ద నగదు డ్రా చేసుకునేందుకు వచ్చే అమాయక ప్రజలను ఎటిఎం కార్డులు మార్చి ఏమారుస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ లో Cr.No.139/2026 Cr.No..318(4), 303(2) BNS మరియు Cr.No.140/2026 U/Sec.318(4), 303(2) BNS కేసులను బంగారుపాళ్యం పోలీసులు నమోదు చేయడం జరిగింది.దీనిపై జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు పలమనేరు సబ్– డివిజన్ డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆదేశాల మేరకు, బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు దర్యాప్తు ప్రారంభించారు.సాంకేతికతను ఉపయోగించి రాబడిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ గారు ఎస్.ఐ. టీ . ప్రసాద్ మరియు సిబ్బంది 24–08–2026న బంగారుపాళ్యం పాలేరు బ్రిడ్జ్ వద్ద అనుమానాస్పదంగా మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో బంగారుపాలెం నందు జరిగిన రెండు ఎటిఎం ల వద్ద మోసం చేసిన తానే నిందితుడిని అంగీకరించాడు.అనంతరం నిందితుడు ఎటిఎం కేంద్రాల వద్ద నగదు డ్రా చేసుకునేందుకు వచ్చే అమాయక ప్రజలను గమనించేవాడు. వారికి ఎటిఎం లో డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మించి, వారి ఎటిఎం కార్డు మరియు పిన్ తెలుసుకునేవాడు.అనంతరం వారి అసలు ఎటిఎం కార్డుకు బదులుగా తన వద్ద ఉన్న వేరొక ఎటిఎం కార్డును ఇచ్చి మోసం చేసేవాడు. తీసుకున్న అసలు ఎటిఎం కార్డులను ఉపయోగించి ఇతర ఎటిఎం కేంద్రాలకు వెళ్లి బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి నగదును డ్రా చేసుకునేవాడని విచారణలో వెల్లడైంది. Cr.No.139/202601–08–2026న కే .జీ . సత్రంలోని ఎస్బిఐ ఎటిఎం వద్ద వై . శివనాయుడు అనే వ్యక్తిని మోసం చేసి, అతని ఎటిఎం కార్డును మార్చి తీసుకున్నాడు. అనంతరం ఆ కార్డును ఉపయోగించి రూ.15,000/– నగదును అక్రమంగా డ్రా చేశాడు. Cr.No.140/202616–08–2026న బంగారుపాళ్యం టౌన్, గాజులపల్లి రోడ్డులోని ఇండియా వన్ ఎటిఎం వద్ద సి . కరుణాకరన్ అనే వ్యక్తిని ఇదే విధంగా మోసం చేసి, అతని ఎటిఎం కార్డును మార్చి తీసుకున్నాడు. అనంతరం రూ.15,900/– నగదును అక్రమంగా డ్రా చేశాడు.స్వాధీనం చేసుకున్న సొత్తు రూ.15,000/– నగదు జతీ.చీశీ.139/2026 కేసుకు సంబంధించినది.

రూ.15,900/– నగదు Cr.No.140/2026 కేసుకు సంబంధించినది. మొత్తం రూ.30,900/– నగదు. 67 ఎటిఎం కార్డులు. ఒక బ్లూ కలర్ సుజుకి ఆక్సిస్ మోటార్ సైకిల్.అరెస్ట్ అయిన నిందితుడి వివరాలు:మేలుమై దుర్గాప్రసాద్, వయస్సు 28 సంవత్సరాలు, తండ్రి ఎమ్ . చంద్రయ్య, ఆర్ /శీ 5–39/2, బేరుపల్లి గ్రామం, పెంగరగుంట పోస్టు, పలమనేరు మండలం, చిత్తూరు జిల్లా.నిందితుడిని అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడమైనది. కేసులపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రజలకు సూచన ఎటిఎం వద్ద అపరిచిత వ్యక్తుల సహాయం తీసుకోకండి. మీ ఎటిఎం కార్డు, పిన్ , ఓటీపీ వంటి రహస్య వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు. ఎటిఎం కార్డు మార్చే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు, ఎస్సై ప్రసాద్, ఏఎస్ఐ నరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# వైభవంగా శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆరాధన మహోత్సవాలు



మనుబోలు, స్వర్ణ సాగరం :

మనుబోలులో వెలసిన ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి దేవస్థానంలో ఆరాధన మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.ఘనంగా దునిపూజ పూర్ణాహుతిఆరాధన మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో దునిపూజ, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ సాగిన ఈ పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పల్లకి సేవ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

భారీగా తరలివచ్చిన భక్తులు...స్వామి వారి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని ఉమ్మడి ప్రాంతం నుంచే కాక వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ భగవాన్ వెంకయ్య స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులందరూ స్వామివారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉభయకర్తలుగా దంపతులు..ఈ పవిత్ర కార్యక్రమాలకు ముంగర విజయభాస్కర్ రెడ్డి – విజయమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు సమర్పించారు.ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించి, విచ్చేసిన భక్తులందరికీ స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# మంత్రి రాకతో సందడి.. అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలకు టీడీపీ నేత సుధీర్ ఘన సన్మానం



ఓజిలి(స్వర్ణ–సాగరం)ఆగస్టు25:

తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు ఘన స్వాగతం లభించింది.సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీని కూడా నాయుడుపేట పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్ ఘనంగా సన్మానించారు.మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతం గా తీసుకెళ్లాలని సుధీర్ పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపు ని చ్చారు.కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా పనిచేస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలకు శుభాకాంక్షలు తెలిపారు.

# చిల్లమానుచేను జడ్పీ హైస్కూల్ టాపర్లకు బయోస్టాడ్ ఇండియా చేయూత..

## రూ.30 వేల ప్రోత్సాహక నగదు ప్రకటింపు...ప్రతిభకు పురస్కారం...ప్రశంసాపత్రాలతో సత్కారం

## పదో తరగతి మెరిట్ విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ

## ఓజిలి మండలంలో విద్యార్థుల విజయాలకు బయోస్టాడ్ ఇండియా ప్రోత్సాహం..

## కష్టానికి గుర్తింపు..పదో తరగతి ప్రతిభావంతులకు ఒక్కొక్కరికి రూ.3 వేల బహుమతి

ఓజిలి (స్వర్ణ–సాగరం)ఆగస్టు 25:

తిరుపతి జిల్లా ఓజిలి మండలం చిల్లమానుచేను జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభకు బయో స్టాడ్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఘన గుర్తింపు ఇచ్చింది.ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులను సంస్థ ఆధ్వర్యం లో సత్కరించారు.ప్రతి విద్యార్థికి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.30 వేల ప్రోత్సాహక నగదును అందజే యనున్నట్లు సంస్థ మేనేజర్ యూపీ నరసింహారెడ్డి ప్రకటించారు.మంగళవారం నిర్వహించిన కార్యక్రమం లో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి అభినంద నలు తెలిపారు.ప్రోత్సాహక నగదును నేరుగా విద్యార్థు ల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఆయన వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో ప్రతిభకు ప్రోత్సాహం అందించడం తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగమని పేర్కొన్నారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో మరింత కృషి చేసి భవిష్యత్తులో గొప్ప విజయాలు



సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఎస్. సునీల్ కుమార్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి ప్రోత్సాహకాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి మరిన్ని విజయాలకు బాటలు వేస్తాయని అన్నారు.విద్యార్థులు కూడా ఈ గుర్తింపును జీవితాంతం స్ఫూర్తి గా తీసుకుంటామని హర్షం వ్యక్తం చేశారు.పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది.త ల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు విద్యార్థుల విజయాలను అభినంది ంచి శుభాకాంక్ష లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ యూపీ నరసింహారెడ్డి,సందీప్ రెడ్డి,మురళి, ఎల్లంరాజు, సురేష్ రాజు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ సంస్థ చర్య విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని స్థానికులు కొనియాడారు.

# గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో ఆంతర్యం ఏమిటి?





## కూటమి నాయకుల్లో ఆందోళన ఎందుకు..

## ఎన్టీఆర్ విగ్రహాన్ని కామిరెడ్డి ఇంటి ముందే ఎందుకు పెట్టాలి? స్థానికుల్లో నెలకొన్న వెయ్యి డాలర్ల ప్రశ్నలు..

పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 25.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చేపట్టిన గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని కూటమి నాయకులు అడ్డుకోవడంలో ఆంతర్యం ఏమిటి, సత్యనారాయణ రెడ్డి చేపట్టే గుడ్ మార్నింగ్ కార్యక్రమం వల్ల టిడిపి నాయకుల్లో నెలకొన్న ఆందోళన ఎందుకు? దివంగత మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని చిల్లకూరు గ్రామంలోని సత్యనారాయణ రెడ్డి నివాసం ముందే ఎందుకు పెట్టాలనుకుంటున్నారు ఇలా వెయ్యి డాలర్ల ప్రశ్నలు సామాన్య జనంలో సమాధానం లేక తికమక పడుతున్నారు. మార్చి 14న కలవకూరు గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది నందు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా భారీ యంత్రాలతో ఇసుక అక్రమ త్రవ్వకాలు చేపట్టి లారీలతో ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేపట్టడాన్ని వైకాపా శ్రేణులు మాచి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా మరికొందరు రైతుల కలిసి అడ్డుకోవడం జరిగింది. ఈ విషయంలో టిడిపి నేతల ప్రోద్భలంతో 26 మందిపై అక్రమ కేసులు పెట్టి నెల్లూరు జైలుకు తరలించారు. అయితే వీరిలో సత్యనారాయణ రెడ్డిని మాత్రం 97 రోజులు నిర్బంధించడం జరిగింది. బెయిల్ పై విడుదలైన కామిరెడ్డి గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేపట్టారు.

**గుడ్ మార్నింగ్.......** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామారెడ్డి సత్యనారాయణరెడ్డి గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేపట్టి ప్రస్తుత రెండేళ్ల కూటమి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గత జగనన్న పాలనలో ప్రజలు అందుకున్న సంక్షేమ ఫలాలు గురించి తెలుసుకుంటూ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలోనే చిల్లకూరు, జీలపాటూరు, దొడ్ల వారి మిట్ట, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, పునబాక గ్రామాల్లో గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేపట్టారు. అయితే రావులపాడు, పునబాక గ్రామాలలో గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులు అడ్డుకొని నిలిపివేశారు. స్థానిక పోలీసుల సహకారంతోనే పలుమార్లు గుడ్ మార్నింగ్ కార్యక్రమం అడ్డుకోవడం, కొందరు వైకాపా నాయకులపై దాడులకు పాల్పడడం విశేషం.

**ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటులో ఆంతర్యం ఏమిటి?.......** దివంగత మహానేత స్వర్గీయ ఎన్ టి రామారావు విగ్రహాన్ని చిల్లకూరు గ్రామంలో సత్యనారాయణ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసే ప్రయత్నంలో దాగివున్న ఆంతర్యం ఏమిటి అని మండల ప్రజలలో పెద్ద చర్చ కొనసాగుతుంది. మండల కేంద్రమైన పెళ్ళకూరు, మేజర్ పంచాయతీ అయినా చెంబెడు గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉండగా చిల్లకూరులోనే... అది కూడా సత్యనారాయణ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న సన్నాహాలు ఏమిటని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విగ్రహం ఏర్పాటు విషయంలో ఇరువర్గాలు నాయకులు కోర్టులను ఆశ్రయించడంలో ఉన్న ఆంతరం ఏమిటో సామాన్య ప్రజానీకానికి అంతుచిక్కని ప్రశ్న. గత జగనన్న పాలనలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న చైతన్య కృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు, సత్యం రాజు, మల్లికార్జున్ రెడ్డి, మస్తాన్ రెడ్డి తదితరులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగుదేశం పార్టీలో చేరి పావులు కదుపుతున్నారు. ఎంతోకాలంగా టిడిపిలో కొనసాగుతూ సీనియర్లుగా ఉంటున్న అనేకమంది నాయకులు సైతం వైకాపా నుంచి టిడిపిలో చేరిన నాయకులు తో ముందుకు సాగుతున్నట్టు తెలుస్తుంది. ఏది ఏమైనాప్పటికీ మండల కేంద్రమైన పెళ్ళకూరులో ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని కొందరు, చిల్లకూరు గ్రామంలో సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తే బాగుంటుందని మరికొందరు లోలోపల అనుకుంటున్నట్లు తెలుస్తుంది.

**వైర్యం ఎవరి మధ్య జరుగుతుంది....** రెండేళ్ల కూటమి పాలనలో అటు తెలుగుదేశం పార్టీ ఇటు వైకాపాలో కొనసాగుతున్న విభేదాలు కోర్టులకు చేరాయి. అయితే ఇరు పార్టీ నాయకులలో రాజకీయ యుద్ధం ఎవరి మధ్య జరుగుతుంది అనే విషయం సామాన్య జనానికి అంతుచిక్కడం లేదు. ఒక ప్రక్క సత్యనారాయణ రెడ్డి మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి అటు టిడిపి పెద్ద ఉండే పార్టీ గంగా ప్రసాద్ ను, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ను ఏకిపారేస్తున్నారు. ఈ క్రమంలోనే టిడిపి నాయకులు సైతం మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి తమదైన శైలిలో సత్యనారాయణ రెడ్డి పై మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు. చివరికి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు ప్రతాపం ఎలా ఉంటుందో జనం చేతుల్లోనే ఉందని మరికొందరు జోష్యం చెబుతున్నారు. మండలంలోని 24 పంచాయతీలు, 10 ఎంపీటీసీ స్థానాలు ఒక ఎం జెడ్పిటిసి స్థానంతో పాటు ప్రజాస్వామ్యబద్ధంగా కైవసం చేసుకుంటామని సత్యనారాయణ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే కూటమి నాయకుల అందరికీ ఏమాత్రం పౌరుషం ఉన్న ఆస్తులు తాకట్టు పెట్టి అయినా సరే సత్యనారాయణ రెడ్డిని జీరో చేయాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ రెడ్డి పిలుపునివ్వడం మండలంలో పెద్ద చర్చ కొనసాగుతుంది. నాయకుల మధ్య కొనసాగుతున్న సవాళ్ల ప్రతి సవాళ్ల పై సామాన్య జనంలో ఉత్కటం నెలకొన్నది.

# ఓజిలిలో బీఆర్‌సీ పాయింట్ పర్సన్‌లకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

## ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుతున్న ఏపీ సి.ఎన్.ఎఫ్

ఓజిలి,(స్వర్ణ-సాగరం)ఆగస్టు25:

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖం ఆదేశాల మేరకు, అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పట్టాభిరెడ్డి సూచన లతో ఓజిలి రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం పై రెండో రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు.ప్రతిగ్రామం నుంచి ఎంపికైన బీఆర్‌సీ పాయింట్ పర్సన్‌లకు ప్రకృతి వ్యవసాయ వనరుల సరఫరా, వినియోగంపై అవగా హన కల్పించారు.మండల ఎఫ్ఎంటీ వీరరాఘవయ్య, బీఆర్‌సీ యజమానుల సమక్షంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఏపీ సి.ఎన్.ఎఫ్ 9 సార్వత్రిక సూత్రాలు పీఎండీఎస్ విధానంపై శిక్షణ ఇచ్చారు.ప్రకృతి వ్యవసా యంలో 365 రోజులూ భూమిని పంట అవశేషాలు లేదా పచ్చదనంతో కప్పి ఉంచడం, అంతర పంటలు, మిశ్రమ పంటల సాగు విధానాలను వివరించారు.ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు సాగు చేయడం, ఐదు లేయర్ మోడ ల్ ద్వారా పంటల సాగు ప్రయోజనాలను తెలియజేశారు .జీవామృతం, ఘన జీవామృ తం, ఆచ్ఛాదనతో పాటు ఎర పంటల ప్రాముఖ్యతను వివరిం చారు.ఏటీఎం మోడల్ ఏర్పాటు విధానం,దాని లక్ష్యాలను శిక్షణలో వివరించారు. డీఆర్‌పీ ఎం,ఏ గ్రేడ్ మోడల్ సాగు విధానాలు, మొక్కల మధ్య పాటించాల్సిన దూరంపై



అవగాహన కల్పించా రుజిగురు అట్టలు, వివిధ రకాల ట్రాప్‌లు ఎలా పని చేస్తాయో, వాటి వినియోగంతో పురుగు నియంత్రణ చేపట్టే విధానాన్ని ప్రదర్శించారు.విత్తన బ్యాంకు ఏర్పా టు విధానాన్ని వివరించడంతో పాటు, విత్తన గుళికల తయారీని ప్రత్యక్షంగా చేసి చూపించారు.ఈ కార్య క్రమంలో ఎఫ్ఎంటీలు వీరరాఘవయ్య, ఏడుకొండలు, ధనంజయ,నారాయణమ్మతో పాటు బీఆర్‌సీ సిబ్బంది, బీఆర్‌సీ పాయింట్ పర్సన్‌లు, రైతులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం,స్వర్ణ సాగరం ఆగస్టు 25:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంగళ వారం దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , మరియు జిల్లాలోని వివిధ శాఖల యంత్రాంగంతో క్యూలైన్లు, బస్టాండు, కాణిపాకం ఆలయం నందు, మరియు కాణిపాకం గ్రామంలో పర్యటించి విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగింది, ఎలక్ట్రికల్, మరియు ఫైర్ పై, షాపుల వారికి మరియు సిబ్బందికి అవగాహనలు తెలపడం జరిగింది, గ్రామం మాడా విధులలో తిరిగి తనిఖీలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, చిత్తూరు అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, సిఐ శ్రీధర్ నాయుడు, ఐరాల ఎమ్మార్వో, ఆర్ అండ్ బి, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మండల అధికారులు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, ఇంజనీరింగ్ శాఖ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# గూడలి గిరిజన కాలనీలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం





## ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్

## గజమాలతో స్వాగతం పలికిన పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి

స్వర్ణసాగరం కోట (ఆగస్టు 25)


గడిచిన రెండేళ్లకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం కోట మండల పరిధిలోని గూడలి పంచాయితీలో గిరిజన కాలనీ నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణారెడ్డి సునీల్ కుమార్ కు శాలువా గజమాలతో మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పాంప్లెట్ ను పంచుతూ వివరించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డప్పుడు నుంచి గూడలి పంచాయతీలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని వాటిలో సూపర్ సిక్స్ లో భాగంగా వృద్ధులకు వృద్ధాప్య పింఛన్ 755 మందికి 31లక్షల70 వేల రుపాయలు,తల్లికి వందనం కింద 660మంది విద్యార్థులకు 84 లక్షల 45 వేల రూపాయలు, ఆటో డ్రైవర్లకు రెండు లక్షల పదివేల రూపాయలు, వెలుగు మహిళలకు 9 కోట్ల 43 లక్షల ఏడు వేల రూపాయలు, సిసి రోడ్లు 40 లక్షల రూపాయలు, ఇరిగేషన్ వర్క్స్ 4లక్షలు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 265 రైతులకు 7 లక్షల రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా 22 మంది లబ్ధిదారులకు 11 లక్షల ఇరవై వేల రూపాయలు, మొత్తం గాను 13 కోట్ల 50 లక్షల రూపాయలు అభివృద్ధి కొరకు అందజేశామని తెలిపారు. ఇంతటి అభివృద్ధి ఏ ప్రభుత్వంలో చేయలేదని గతంలో టిడిపి ప్రభుత్వం ద్వారా కొంత అభివృద్ధి జరిగిందని ఆయన తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభు త్వంపై నమ్మకం ఉంచి స్థానిక నాయకుల గెలుపుకు తోడ్ప డాలని ఆయన పిలుపునిచ్చారు.మండల పార్టీ అధ్యక్షు లు పలగటి భాస్కర్ రెడ్డి ,ఏ ఎం సి ఛైర్పర్సన్ మర్రి ప్రమీల ,మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్,యూనిట్ ఇంచార్జ్ మద్దాలి సర్వోత్తమ రెడ్డి, పెన్నాక చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయ కులు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, వాకా విజయ్ భాస్కర్ రెడ్డి, మధు యాదవ్,సోషల్ మీడి యా అధ్యక్షులు మీజూరు మధు బాబు, భూచి సుబ్రహ్మణ్యం, కోట ధనుంజాయ్, నల్లారి గోపాలయ్య, కట్టా ఏడుకొండలు, కిల్లా రోహిత్, ప్రసన్న, పులమర్తి కోటేశ్వర్ రెడ్డి, బీజేపీ నా యకులు శరత్, జనసేన నాయకులు మధు కూటమి నాయాలుకు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లోకనాథన్ కి నివాళులర్పించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా డిఫెన్స్ సోల్జర్స్



ఐరాల, స్వర్ణ సాగరం ఆగస్టు 25 :

ఐరాల మండలం వడ్డీ పల్లె గ్రామంలోకనాథన్ బొంబాయి ఇంజనీర్ ఆర్మీ లో 11 సర్వీస్ చేస్తున్నాడు.ఆరోగ్య రిత్య కారణాలవల్ల చనిపోవడం జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా డిఫెన్స్ సోల్జర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లోకనాథన్ పార్థిక దేహం మీద జాతీయ జెండా వేసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ప్రకటించారు. వాళ్ల కుటుంబానికి మాన ఉమ్మడి చిత్తూరు జిల్లా డిఫెన్స్ సోల్జర్స్ గ్రూప్ ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు మాజీ సైనికులు దుర్గ, సైనికులు మనోజ్ కుమార్ , హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.



## రవితేజ, దిల్‌రాజుల మూవీ #SVn64 త్వరలో టైటిల్ అనౌన్స్‌మెంట్

'ఇరుముడి' సంచలన బ్లాక్‌బస్టర్ విజయంతో దూసుకుపోతున్న మాస్ మహారాజా రవితేజ, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు సిద్ధమయ్యారు. దర్శకుడు హసిత్ గోలితో కలిసి రవితేజ ఓ హార్డ్‌కోర్ ఎంటర్‌టైనర్ చేయనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ, హసిత్ గోలి, ఎస్వీసీ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. తన ఎనర్జీ, కామెడీ టైమింగ్‌తో కమర్షియల్ ఎంటర్‌టైనర్లను రవితేజ మరో స్థాయికి తీసుకెళ్తే.. వైవిధ్యమైన కథలు, హ్యూమర్ తో హసిత్ గోలి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ఇద్దరి కలయికలో రాబోతున్న సినిమా అంచనాలు పెంచింది. తాజాగా సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. చూఎఅ64 సంక్రాంతి కానుకగా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. దీంతో వచ్చే సంక్రాంతికి రవితేజ నుంచి ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను అలరించనుంది.హసిత్ గోలి రూపొందించనున్న ఈ కామెడీ డ్రివెన్ కాన్సెప్ట్‌లో రవితేజ సరికొత్తగా కనిపించబోతున్నారు.

# ఘనంగా "చిరంజీవి" మూవీ ప్రీ రిలీజ్



కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా "చిరంజీవి". ఈ చిత్రంలో ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. "చిరంజీవి" సినిమా ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ యష్ మిట్టల్ మాట్లాడుతూ - మా కికు "చిరంజీవి" సినిమా సరికొత్త కంటెంట్ తో మీ ముందుకు రాబోతోంది. ఈ నెల 28న థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు కొరియోగ్రాఫర్ గోవింద్ మాట్లాడుతూ - ఈ సినిమా నాకొక పెద్ద అవకాశంగా భావిస్తున్నా. ఈ చిత్రంలో డిఫరెంట్ కాన్సెప్ట్ తో సాంగ్ కొరియోగ్రాఫ్ చేశాం. సినిమా ఒక యూనిక్ కాన్సెప్ట్ తో మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. అన్నారు. డీవోపీ రామకృష్ణ మాట్లాడుతూ - కికు "చిరంజీవి" సినిమాను ప్రేక్షకులు సీట్ ఎడ్జ్ లో కూర్చుని చూస్తారు. అంత థ్రిల్లింగ్ గా సినిమా మొత్తం ఉంటుంది. ఈ చిత్రానికి మీ సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు. యాక్టర్ గిరీష్ మాట్లాడుతూ - ఈ సినిమా ఫస్ట్ ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు మిమ్మల్ని ఎంగేజ్ చేస్తుంది. ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు అన్నట్లు సినిమా తీసి చూడు అని చెప్పాలి. ఈ సినిమా కోసం కికు చాలా కష్టపడ్డాడు. ఆయన కష్టానికి ఫలితంగా మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నా. అన్నారు. యాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ - ఈ నెల 28న మా సినిమా రిలీజ్ కు వస్తోంది. తెలుగు ఆడియెన్స్ తెలుగు సినిమాలను చూసేందుకు ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నా. ఈ చిత్రానికి కికు అన్నీ తానై చూసుకున్నాడు. కొత్తదనం నిండిన సినిమాగా కికు "చిరంజీవి" మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు. ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ మాట్లాడుతూ - ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకు ఒక్క నిమిషం కూడా మీరు చూపు తిప్పుకోకుండా ఎంగేజ్ చేసేలా ఉంటుంది. కికు, దీప్తి, డైరెక్టర్ శుభ గారు మొదటి నుంచి సినిమాను నమ్మారు. సినిమా కోసం కష్టపడుతున్నారు. ఇప్పటికీ అదే నమ్మకంతో ప్రమోషన్స్ చేస్తున్నారు. వాళ్ల నమ్మకం థియేటర్స్ లో నిజం కావాలి. ఈ సినిమా మంచి సక్సెస్ అందుకోవాలని కోరుకుంటున్నా. అన్నారు. జుబేదా అలీ మాట్లాడుతూ - ఈ సినిమా ట్రైలర్ చూసినప్పుడు కికులో ఒక హీరోతో పాటు ఒక విలన్, ఒక కమెడియన్ కనిపించారు. ఈ చిత్ర కథ ఎలా ఉంటుందో నాకు తెలియదు గానీ ట్రైలర్ తో ఇంట్రెస్ట్ క్రియేట్ చేశారు. ఈ సినిమా కోసం హీరో కికు, ప్రొడ్యూసర్ దీప్తి చాలా కష్టపడ్డారు. వాళ్లకు ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి. అన్నారు. యాక్టర్ శ్రీకాంత్ అయ్యంగార్ మాట్లాడుతూ - చిన్న సినిమాను ప్రతి ఒక్కరూ సపోర్ట్ చేయాలి. ఓటీటీలో కాకుండా థియేటర్స్ లో ఈ సినిమాను చూడమని కోరుతున్నా. కికు, దీప్తి ఈ చిత్రాన్ని ఇష్టపడి కష్టపడి చేశారు. ఇలాంటి వాళ్లను సపోర్ట్ చేస్తే మరిన్ని మంచి చిత్రాలు చేస్తారు. అన్నారు. ప్రొడ్యూసర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ - ఇటీవల థియేటర్స్ కు ప్రేక్షకులు బాగా వస్తున్నారు. చిన్న చిత్రాలు ఆదరణ పొందుతున్నాయి. కికు, దీప్తి ఎన్నో అడ్డంకులు దాటుకుని తమ సినిమాను రిలీజ్ కు తీసుకొస్తున్నారు. ఈ సినిమాను కూడా మీరు సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ శుభ సాయి వెంకట్ మాట్లాడుతూ - మా సినిమాకు వచ్చిన ఇబ్బందులు సాల్వ్ అయ్యేలా ప్రొడ్యూసర్ కౌన్సిల్ తరుపున మా ప్రసన్న గారు సహకారం అందించారు. ఆయనకు థ్యాంక్స్ చెబుతున్నాం. ఈ కథలో ఒక డేరింగ్ రిస్కీ ఎలిమెంట్ ఉంది. అది ట్రైలర్ లో చూపించలేదు. అలాంటి రిస్కీ పాయింట్ ను నమ్మి మా ప్రొడ్యూసర్స్ సినిమా చేశారు. కథను నమ్మి నిలబడ్డారు. వారి కోసం మా మూవీ హిట్ కావాలి. ఈ నెల 28న మీరు ఇచ్చే రెస్పాన్స్ కోసం వెయిట్ చేస్తున్నాం. అన్నారు. ప్రొడ్యూసర్ దీప్తి నడిమింటి మాట్లాడుతూ - ఒక మంచి సినిమా చేశామనే నమ్మకంతో మేమంతా ఉన్నాం. సినిమా కంటెంట్ మీద నమ్మకంతో ఈ నెల 28న ధైర్యంగా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. మీరు థియేటర్స్ కు రండి ఎక్కడా డిజప్పాయింట్ అవరు. ప్రొడ్యూసర్స్ గా నా గ్యారెంటీ అది. ఈ సినిమాలో హీరోయిన్ రోల్ కు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఆమె మా మూవీ ప్రమోషన్స్ కి రాకపోవడం బాధాకరం. ప్రొడ్యూసర్ కౌన్సిల్ నుంచి మాకు సహకారం అందించిన ప్రసన్నకుమార్ గారికి, సినిమా మేకింగ్ టైమ్ లో సపోర్ట్ చేసిన ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ గారికి థ్యాంక్స్ చెబుతున్నాం. అన్నారు. హీరో కికు యనమల మాట్లాడుతూ - మా సినిమా ఈవెంట్ కోసం టైమ్ కేటాయించి మా కోసం వచ్చిన అతిథులకు థ్యాంక్స్ చెబుతున్నాం. మా చిత్రంలో అవకాశాన్ని ముఖ్యమని భావించి పనిచేసి ఇప్పుడు ప్రమోషన్స్ కు కూడా రాని వాళ్లను చూస్తుంటే బాధగా ఉంది. మా సినిమా ప్రమోషన్ ను ఏపీలోని పలు ప్రాంతాల్లో చేశాను. అక్కడ రెస్పాన్స్ చాలా బాగా వచ్చింది. హైదరాబాద్ లో ఒక కాలేజ్ వాళ్లు మాత్రం ఈవెంట్ కు పర్మిషన్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. దాంతో మాకు సమయం వృథా అయ్యింది. కొన్ని థియేటర్స్ లో మా సినిమా ఫ్లెక్సీలను తీసేసి మరో పెద్ద సినిమా ఫ్లెక్సీలు పెడుతున్నారు. అది డబ్బింగ్ మూవీ. ఆ సినిమాకు ప్రాధాన్యత ఇవ్వండి తప్పు లేదు కానీ మన స్ట్రైట్ తెలుగు సినిమాను ఎందుకు సపోర్ట్ చేయరు అని అడుగుతున్నా. మన సినిమాలకు పక్క రాష్ట్రాల్లో ప్రాధాన్యత ఇవ్వరు, సపోర్ట్ చేయరు. ఇక్కడ తెలుగులో కూడా తెలుగు సినిమాకు సహకరించకుంటే ఎలా. ఎవరు సపోర్ట్ చేయకున్నా మేము భయపడము. మా కంటెంట్ మీద నమ్మకం ఉంది. తమ సినిమాల మీద నమ్మకం ఉన్న కొత్త వాళ్లు ఎవరైనా భయపడకుండా ఇండస్ట్రీకి రండి. మీ కంటెంట్ మిమ్మల్ని నిలబెడుతున్నా. ప్రసన్న గారు, ఛోటా కె ప్రసాద్ లాంటి వాళ్లు మా సినిమాకు ఎంతో సహకారం అందించారు.

# "ఇడుపు కాయితం" మూవీ నుంచి 'శ్రీలత సాంగ్' ప్రోమో రిలీజ్

ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు.

ఈ రోజు హీరో ప్రియదర్శి పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయనకు బర్త్ డే విశెస్ తెలియజేస్తూ "ఇడుపు కాయితం" సినిమా నుంచి 'శ్రీలత సాంగ్..' ప్రోమో రిలీజ్ చేశారు. కొత్తగా పెళ్లయిన జంట శ్రీలత, శ్రీనివాస్ మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్ గా ఈ పాటను చిత్రీకరించారు. ఈ సాంగ్ ప్రోమో ఎలా ఉందో చూస్తే - 'ఓ శ్రీలత శ్రీలత శ్రీలత నువ్వు సిన్నబోకే నా శ్రీలత, ఓ శ్రీలత శ్రీలత శ్రీలత నువ్వు సిన్నబోకే నా శ్రీలత, శ్రీలత శ్రీలత శ్రీలత ఈ శ్రీనివాసుడే నీ జత' అని ఆకట్టుకునేలా సాగుతుంది. త్వరలో ఈ పాట ఫుల్ వెర్షన్ రిలీజ్ చేయనున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మంచి మెలొడీ ట్యూన్ తో ఈ పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు.

"ఇడుపు కాయితం" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో దర్శక నిర్మాతలు షేర్ చేసుకోనున్నారు.

నటీనటులు - ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు





# "ఫాదర్" సినిమా టీజర్ రిలీజ్

డార్లింగ్ కృష్ణ, ప్రకాష్ రాజ్, అమృత అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "ఫాదర్". ఈ చిత్రాన్ని ఆర్ సి స్టూడియోస్ బ్యానర్ పై ఆర్ చంద్రు, యమున చంద్రశేఖర్, ఆనంద్ పండిట్ నిర్మిస్తున్నారు. రాజమోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫాదర్, సన్ బాండింగ్ నేపథ్యంగా సాగే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా కథతో తెరకెక్కిన ఈ సినిమా త్వరలో గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "ఫాదర్" సినిమా టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. "ఫాదర్" సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే - తండ్రి( ప్రకాష్ రాజ్ )ని దేవుడిలా కొలిచే కొడుకు కృష్ణ (డార్లింగ్ కృష్ణ). మళ్లీ జన్మంటూ ఉంటే కృష్ణకు తండ్రిగా పుట్టాలని కోరుకునేంత ప్రేమను గుండెల నిండా నింపుకుంటాడు తండ్రి. అంతగా ప్రేమించిన కొడుకును వదిలి తండ్రి దూరంగా వెళ్లిపోవాలనుకుంటాడు. ఈ ఎడబాటుకు కారణం ఏంటి, కొడుకును వదిలి తండ్రి ఎందుకు దూరంగా వెళ్లిపోవాలని అనుకున్నాడు వంటి అంశాలతో "ఫాదర్" సినిమా టీజర్ ఆసక్తికరంగా సాగింది. గగనపు సూర్యుడే, వెలుగుల చంద్రుడే, ధరణికి దేవుడే నాన్నా...అంటూ వచ్చిన బీజీఎం సాంగ్ హార్ట్ టచింగ్ గా ఉంది. ఫాదర్, సన్ రిలేషన్ నేపథ్యంగా ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫ్యామిలీ మూవీ చూడబోతున్నామనే ఇంప్రెషన్ ను ఈ టీజర్ కలిగిస్తోంది. నటీనటులు - డార్లింగ్ కృష్ణ, ప్రకాష్ రాజ్, అమృత అయ్యంగార్, నాగభూషణ ఎన్ ఎస్, రమేష్ ఇందిర, అవినాష్, హ్నన్నవల్లి కృష్ణ, గగన్ బిఎ, తదితరులు

Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh.
Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367